ప్రజాశక్తి



శుక్రవారం 11 ఏప్రిల్, 2025 5 శ్రీకాకుళం

ప్రభుత్వ కార్యక్రమంగా పూలే జయంతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా శుక్రవారం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఈ వేడుకల్లో భాగంగా రూ.ఐదు కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన బిసి భవన్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ముందుగా జ్యోతిరావు పూలే పార్కులో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించనున్నట్లు పేర్కొన్నారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు ఇతర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు తెలిపారు.

డీలిమిటేషన్‌పై విశాల చర్చ అవసరం

సెమినార్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన)పై విశాల ప్రాతిపదికన చర్చ జరగాల్సిన అవసరముందని మాజీ ఎమ్మెల్సీ ఎం.వి.ఎస్ శర్మ అన్నారు. నగరంలోని స్థానిక కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో 'నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పూర్వాపరాలు - శాస్త్రీయ పద్ధతి' అంశంపై గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కోశాధికారి పి.సుధాకరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య వక్తగా మాట్లాడారు. జనాభా ప్రాతిపదికన నియోజవర్గాల పునర్విభజన చేపడతామని చెప్తున్న బిజెపి ప్రభుత్వం 2021 నాటి జనాభా లెక్కలను ఎందుకు తీయడం లేదని ప్రశ్నించారు. జనాభా లెక్కలు తెలితే వెనుకబడిన రాష్ట్రాల జనాభా, ఆర్థిక, జీవన పరిస్థితులతో పాటు ముస్లింల జనాభా పెరిగిపోతుందన్న బిజెపి వాదన బయటపడేదన్నారు. బిసి సామాజిక తరగతి జనాభా ఎంత ఉందో లెక్కలు లేవన్నారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం మందికి, పట్టణ ప్రాంతాల్లో 63 శాతం మంది పౌష్టికాహారం అందడం లేదని, ప్రజల వినియోగ శక్తిపై చేపట్టిన సర్వేలో తేలిందని చెప్పారు. రాజ్యాంగంలోని మూల స్తంభమైన ఫెడరలిజంపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తోందని, రాష్ట్రాల హక్కులు, వనరులను హరించేస్తోందని విమర్శించారు. కార్పొరేట్లకు ఫెసిలిటేటర్‌గా ప్రభుత్వం ఉండడమే చంద్రబాబు తీసుకొస్తున్న పి-4 విధానం అసలు రహస్యమన్నారు. డీలిమిటేషన్ పేరుతో బిజెపి ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించాలని చూస్తోందన్నారు. రాజ్యాంగంలోని మౌలిక సూత్రాలైన ప్రజాస్వామ్యం, ఫెడరలిజం, సామాజిక న్యాయం, స్వావలంబన అంశాలపై బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. వీటిపై ప్రజల్లో చైతన్యం కల్పించాలని కోరారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.రెడ్డి తిరుపతిరావు మాట్లాడుతూ నియోజకవర్గాల పునర్విభజన శాస్త్రీయ పద్ధతిలో చేపడితే అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ప్రముఖ న్యాయవాది పి.వి.ఎస్ సీతారామయ్య మాట్లాడుతూ ఉత్తర, దక్షిణ భారత దేశాల మధ్య తొలి నుంచీ వివక్ష చూపుతున్నారని విమర్శించారు. విశాఖ రైల్వే జోన్ విషయంలోనూ బిజెపి ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. ఒడిశా రాష్ట్ర ప్రయోజనాల కోసం రాయఘడ జోన్‌ను ఏర్పాటు చేసి విశాఖ రైల్వే డివిజన్ ఆదాయాన్ని తీసుకెళ్లిపోయినా కేంద్ర ప్రభుతం చోద్యం చూస్తోందన్నారు. సభ ప్రారంభానికి ముందు గురజాడ గీతాన్ని ఆలపించారు. అంతరిక్షంలో తొమ్మిది నెలలు గడిపి సురక్షితంగా ధైర్య సాహసాలతో భూమి పైకి తిరిగి వచ్చిన సునీత విలియమ్స్ సభికులంతా లేచి నిలబడి అభినందనలు తెలిపారు. గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం కార్యదర్శి ఎం.ప్రభాకరరావు ఆహ్వానం పలకగా, సతీష్ వందన సమర్పణ చేశారు. సెమినార్‌లో మధు, కె.ఎస్ రామకృష్ణారావు, కె.ఎస్.ఎన్ మూర్తి, గణపతి, కొత్తకోట అప్పారావు, సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు, లక్ష్మి, నాగమణి, చందు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయవాది సీతారామయ్య

సమస్యల పరిష్కారమే లక్ష్యం

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి - టెక్కలి

గ్రామాల వారీగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలనే దిశగా అధికారులు పనిచేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్లకు చెందిన అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే, పిజిఆర్ఎస్, పౌర సేవల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. మ్యుటేషన్, ఆస్తుల తగాదాల పరిష్కారానికి రూపొందించిన ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను పూర్తిగా వినియోగించాలన్నారు. రీ సర్వేలో ఎదురవుతున్న అభ్యంతరాలను వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. పిజిఆర్ఎస్ దరఖాస్తులను ఎస్ఎల్ఎ గడువు దాటిపోకుండా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటివరకు రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన ఫిర్యాదులు ఎన్ని వాటిని ఏమేరకు పరిష్కరించారో నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ప్రభుత్వ భూములు ఆన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో ఉన్న భూ వివరాలపై సర్వే నిర్వహించి ఆక్రమణలు ఉంటే తొలగించాలని కోరారు. రెవెన్యూ పరిధిలోని మ్యుటేషన్లు, నీటితీరువా శిస్తు వసూళ్లు, ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై మండలాల వారీగా సమీక్షించి సమస్యల పరిష్కారానికి దిశానిర్దేశం చేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, ప్రత్యేక ఉప కలెక్టర్ పద్మావతి, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్లు ఆర్.అప్పలరాజు, సోమేశ్వరరావు, రవికుమార్, ఆర్ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గిరిజన గ్రామం సందర్శన

మండలంలోని ముఖలింగాపురాన్ని కలెక్టర్ సందర్శించారు. సరైన రోడ్డు లేకపోవడంతో 250 మీటర్లు కాలినడకన నడిచి గ్రామానికి వెళ్లారు. గ్రామంలోని భౌగోళిక పరిస్థితులను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి గిరిజనుల జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. తాగు, సాగునీటి సౌకర్యం కల్పించాలని గిరిజనులు కలెక్టర్‌కు విన్నవించారు. ఈ ప్రాంత రైతులకు అవసరమైన సాగునీరు కల్పన కల్పించే క్రమంలో గ్రామానికి సరిహద్దులో ఉన్న దుర్గమ్మ చెరువు నుంచి రిజర్వాయరు నిర్మాణం చేపట్టాలని గిరిజనులు కోరారు. రహదారి సౌకర్యాలు కల్పించాలన్నారు. కొండల ప్రాంతంలో కొద్దిసేపు పర్యటిస్తూ... ఆ ప్రాంత స్థితిగతులపై ఆరా తీశారు. మండలంలోని శివారు గిరిజన గ్రామం కావడంతో కలెక్టర్ పర్యటన చర్చనీయాసమైంది. ఈయనతో పాటు ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.



ముళ్లపొదల మధ్య నడుచుకుంటూ వెళ్తున్న కలెక్టర్

వివాదాస్పదంగా మోడల్ స్కూళ్ల ఏర్పాటు

ప్రజాశక్తి- టెక్కలి

ప్రతి పంచాయతీలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసి తరగతి గదికి ఒక ఉపాధ్యాయుడుని నియమించి పాఠశాల విద్యలో సంస్కరణలు చేపడుతున్నామని, రానున్న విద్యాసంవత్సరం నుంచే మోడల్ స్కూల్లు అమలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో మోడల్ స్కూల్ ఏర్పాటు విధానం గ్రామాల్లో వివాదస్పదంగా మారుతుంది. తమ గ్రామాల్లోని పాఠశాలలు ఎత్తి వేయవద్దని గ్రామస్తులు మూకమ్మడిగా పట్టుబడుతున్నారు. అయితే పంచాయతీకి ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు లక్ష్యాన్ని గ్రామాల్లో వివరించి గ్రామస్తులతో ఆంగీకార పత్రాలు తీసుకోవాలని విద్యాశాఖలో ఉన్నతస్థాయి అధికారులు తొందర పెడుతున్నారు. ఈ తరుణంలో మండలస్థాయిలో విద్యాశాఖాధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రభుత్వ విద్యారంగాన్ని, ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తూ... గత ప్రభుత్వం జారీ చేసిన 117 జిఒని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే జిఒ రద్దు చేస్తామని హామీనిచ్చింది. అనంతరం దానిని అమలుచేయలేదు సరికదా... 117 జిఒని పటిష్టత పరుస్తూ... ప్రాథమిక పాఠశాలలు రద్దు స్తూ... మోడల్ స్కూళ్ల విధానాన్ని బలవంతంగా అమలు చేయాలని చూడడం గమనార్హం. ఇందుకు సంబంధించిన ఆదేశాల మేరకు కొద్ది నెలల నుంచి నివేదికలు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా ప్రాథమికోన్నత పాఠశాలలు పూర్తిగా రద్దు కానున్నాయి. మరికొద్ది రోజుల్లో ఈ విద్యా సంవత్సరం పూర్తి కానున్న నేపథ్యంలో మోడల్ స్కూళ్లు ఏర్పాటుపై ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటుండడం విశేషం. ప్రతి పంచాయతీలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేస్తూ... గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను రద్దు చేస్తూ... ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం సరైనదో? కాదో? చెప్పాలని గ్రామాల్లోని విద్యా కమిటీలను కోరారు.

రైతు ఆత్మహత్య



నరసింహమూర్తి మృతదేహం
(ఇన్‌సెట్‌లో నరసింహమూర్తి ఫైల్ ఫొటో)

అప్పల బాధ తాళలేక బలవన్మరణం

అప్పల బాధ తాళలేక కంచిలి మండలం పెద్ద కొజ్జిరియాకు చెందిన రైతు బల్లెడ నరసింహమూర్తి (58) బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పంట పెట్టుబడి కోసం చేసిన అప్పలు గుదిబండగా మారడంతో తీర్చే దారి లేక, అప్పలు ఇచ్చిన వాళ్ల మాటలు పడలేక... పురుగుల మందు తాగి ప్రాణాలు తీసుకున్నాడు. ఈ ఘటనతో పెద్ద కొజ్జిరియాలో విషాదఛాయలు అలముకున్నాయి.

(వార్త... మెయిన్‌లో)

పాఠశాలల ఎత్తివేతకు పన్నాగం

ఎస్ఎంసి తీర్మానాలపై ఉపాధ్యాయులపై ఒత్తిడి : యుటిఎఫ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను కుదించి, వాటిని ఎత్తివేయాలని ప్రభుత్వం పన్నాగం పన్నుతోందని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లండ బాబూరావు, బమ్మిడి శ్రీరామ్మూర్తి విమర్శించారు. ఇందులో భాగంగానే అత్యవసరంగా ఎస్ఎంసి తీర్మానాలను ఆన్‌లైన్ చేయాలని ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని తెలిపారు. ఈ పనిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంటే విద్యాశాఖ అధికారులే చేసుకుంటే ఉపాధ్యాయులకు ఉపశమనం కలుగుతుందని అభిప్రాయపడ్డారు. ఇప్పటికే ఎస్ఎంసి తీర్మానాలు మండల, జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపించామని, మళ్లీ ఇప్పుడు ఎస్ఎంసి తీర్మానాలు చేసి అప్‌లోడ్ చేయాలని ఒత్తిడి చేయడం తగదని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో ఒకటి నుంచి ఐదు తరగతుల ప్రాథమిక పాఠశాల నిర్వహించాలని సూచించారు.

గ్రామ పంచాయతీ కేంద్రాల్లో మోడల్ ప్రైమరీ స్కూల్ ఏర్పాటు చేసి తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున ఐదు తరగతులకు ఐదు గదులు మౌలిక వసతులతో ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. అప్పుడే ప్రాథమిక విద్య బలోపేతమవుతుందని తెలిపారు. మోడల్ ప్రైమరీ స్కూల్ పేరుతో పంచాయితీలో ఉన్న స్కూళ్లు అన్నింటినీ ఫౌండేషన్ పాఠశాలలుగా మార్చే ఆలోచన సరికాదని పేర్కొన్నారు. ఈ విధానం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలకు ఊతమిచ్చేదిగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను అవకాశమున్న చోట 60 మంది విద్యార్థులుంటే హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలను స్కూల్ అసిస్టెంట్లతో యథావిధిగా కొనసాగించాలని కోరారు. కూటమి ప్రభుత్వం విద్యారంగంలో సంస్కరణల పేరుతో ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేయాలే తప్ప బలహీనపరిచే ప్రయత్నం చేయొద్దని సూచించారు.



మాట్లాడుతున్న యుటిఎఫ్ నాయకులు

డిఎంహెచ్‌ఒగా సుజాత

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (పూర్తి అదనపు బాధ్యతలు)గా డాక్టర్ బి.సుజాత నియమితులయ్యారు. ఈమేరకు వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ విభాగం డైరెక్టర్ సుబ్రమణ్యేశ్వరి బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారిగా పనిచేసిన టి.బాలమురళీకృష్ణ ఇటీవల రూ.20 వేలు లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడడంతో ప్రభుత్వం ఆయన్ను సస్పెండ్ చేసింది. దీంతో ఆ స్థానంలో సుజాతను నియమిస్తూ పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆమె ప్రస్తుతం విశాఖపట్నంలోని రీజనల్ ట్రైనింగ్ సెంటర్ ఫిమేల్ విభాగానికి ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్నారు.

అర్హులైన వారికి కార్పొరేషన్ రుణాలు

ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం అర్బన్: అర్హులైన బిసిలు, ఎస్‌సిలకు ఆయా కార్పొరేషన్ల కింద రుణాలను సకాలంలో అందించాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అధికారులను ఆదేశించారు. స్థానిక బిసి కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో గురువారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. ఐదేళ్ల తర్వాత తిరిగి వృత్తిపనివారికి ఆదరణ, ఇతర సంక్షేమ పథకాల కింద తక్కువ వడ్డీ రుణాలు పునరుద్ధరించామన్నారు. రుణాలు పొందడానికి ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల్లో అర్హులను గుర్తించి సకాలంలో రుణాలు అందించేందుకు సహకరించాలని కోరారు. రుణాలు పొందిన వారు తప్పక యూనిట్లు నెలకొల్పి ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ప్రభుత్వం పెద్దఎత్తున రాయితీలు ఇస్తోందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అధికారులు సహకరించాలన్నారు. సంక్షేమ వసతిగృహాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. సమావేశంలో బిసి కార్పొరేషన్ ఇడి గడ్డెమ్మ, బిసి సంక్షేమ అధికారి అనురాధ, సాంఘి సంక్షేమ శాఖ డీడీ రెడ్డి, బిసి, ఎస్‌సి కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ఎల్‌ఐపి అమల్లో బిఆర్‌ఎయు ప్రతిభ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్ (ఎల్‌ఐపి) అమలులో రాష్ట్రస్థాయిలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయం ఉత్తమ ప్రతిభ కనపరిచిందని వర్సిటీ బోర్డు ఫర్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ఎడ్యుకేషన్ (బిసిడిఇ) సమన్వయకర్త డాక్టర్ బలగ అజయ్ కుమార్ అన్నారు. ఈ మేరకు విజయవాడలో రాష్ట్ర సమగ్ర శిక్షా అభియాన్‌లో గురువారం 'యూనిసెఫ్-ఎల్‌ఐపి ప్రాణమిత్ర'పై కార్యశాలలో సన్మానించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. డిగ్రీ కళాశాలల విద్యార్థుల్లో ఎల్‌ఐపిపై అవగాహన కల్పిస్తూ... పలు కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహణలో బిఆర్‌ఆర్‌లో ముందుంజులో ఉందన్నారు. ఈ మేరకు అజయ్‌కుమార్‌ను విసి ఆచార్య కె.ఆర్.రజని, రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాతలు అభినందించారు.



ప్రశంసాపత్రం అందుకుంటున్న అజయ్‌కుమార్

నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు

ఎమ్మెల్యే గోవిందరావు

ప్రజాశక్తి- పాతపట్నం

నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుందని ఎమ్మెల్యే గోవిందరావు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటువంటి జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకొని యువతీ యువకులు ఆయా పరిశ్రమంలో ఉద్యోగం సాధించడం గొప్ప విషయమన్నారు. వెనుకబడిన నియోజకవర్గంలో ఇటువంటి జాబ్‌మేళాలు ఉపాధి అవకాశాలను కల్పిస్తున్న అరబిందో, అపోలో, టైర్స్‌తోపాటు సుమారు 15 కంపెనీల ప్రతినిధులు ఈ జాబ్‌మేళాను నిర్వహించారని తెలిపారు. పాతపట్నం, మెలియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్‌పేట మండలాలతో పాటు పలు గ్రామాల నుంచి సుమారు 650 మంది యువకులు ఈ జాబ్‌మేళాకు హాజరయ్యారని తెలిపారు. ఆసక్తి ఉన్న ఉద్యోగంలో వారు చేరాలని సూచించారు. అనంతరం ఉద్యోగ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరాములు, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా మేనేజర్ సాయి, ఎంప్లాయిమెంట్ అధికారిని సుధారాణి, సెట్ సిఇఒ ప్రసాద్ పాల్గొన్నారు.



ఉద్యోగ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

'ఆపరేషన్ కగార్' ప్రజలపైనే యుద్ధం

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ

ప్రజాశక్తి- పలాస

కేంద్ర ప్రభుత్వం 17 నెలల క్రితం తీసుకొచ్చిన ఆపరేషన్ కగార్ నేరుగా ప్రజలపైన, ప్రజల కోసం పోరాడే నేతలపైన, ఉద్యమకారులపైన యుద్ధమని అని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణ అన్నారు. కాశీబుగ్గలోని ఓ ప్రయివేటు కళ్యాణ మండపంలో సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ అధ్యక్షతన ఆపరేషన్ కగారుపై గురువారం నిర్వహించిన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో కేంద్ర ప్రభుత్వం దేశంలోని వనరులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే కర్తవ్యంగా పెట్టుకుందన్నారు. ప్రజల మనుగడను పట్టించుకోవడంలేదని ఆపరేషన్ కగారు అంతిమ యుద్ధంగా పెట్టుకుందని బిజెపిని విమర్శించారు. గతంలో సల్వార్ జుడుం, ఆపరేషన్ గ్రీన్ హంట్, ప్రస్తుతం ఆపరేషన్ కగారు ప్రకటించి నేరుగా ప్రజలపై ప్రత్యక్ష యుద్ధానికి దిగిందన్నారు. ఆదివాసీలు ఇప్పటికీ దుర్భర జీవితాన్ని అనుభవిస్తూ డోలీల్లో పురుడు పోసుకునే స్థితిలో ఉందన్నారు. రంపచోడవరం నుంచి రాజమండ్రి వరకు గిరిజన ప్రాంతాలు మీదుగా నాలుగు నుంచి ఆరు వరసల రోడ్లు వేస్తామని ప్రకటిస్తున్నారని గుర్తు చేశారు. ఈ రవాణా ఆదివాసీల కోసం కాదని, విలువైన ప్రకృతి సంపదను కార్పొరేట్ సంస్థలకు ధారాధత్తం చేయడానికని విమర్శించారు. గిరిజన ప్రాంతంలో పుట్టి పెరిగిన ఎపి స్పీకర్ చట్టాలను చేయవలసింది పోయి రాజ్యానికి వ్యతిరేకంగా, చట్టవిరుద్ధంగా మాట్లాడటం ఏమిటని నిలదీశారు. ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలకు అభివృద్ధి, స్వేచ్ఛ కల్పించకుండా చేయడం ఇదెక్కడి ప్రజాస్వామ్య మని ప్రశ్నించారు. శ్రీకాకుళం ఉద్యమం ద్వారానే వన్ ఆఫ్ సెవెంటీ యాక్టు వచ్చిందని గుర్తు చేశారు. గతంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పేరుతో దోపిడీ చేస్తే... ప్రస్తుతం అదానీ, అంబానీలకు ఈ దేశాన్ని తాకట్టు పెడుతుందన్నారు. ఉద్యమాలు ద్వారానే హక్కులు సాధించుకునే పరిస్థితిని పాలకులు కల్పిస్తున్నారని దుయ్యబట్టారు. మానవ హక్కుల వేదిక నేత ఎస్.వి.కృష్ణ మాట్లాడుతూ నిర్బంధం ద్వారా కాకుండా సమాజం ముందుకు చేరే మార్గం ఏ రూపంలో ఎదుర్కోవచ్చో చెప్పమని అన్నారు. 20 ఏళ్ల క్రితం నిపుణుల కమిటీ కోరితే నిర్బంధం, అణచివేత ప్రధాన ఆయుధంగా చేసుకొని పాలకులు తమ గమన నీతిని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. గత మూడున్నర నెలలో కాలంలో 135 మంది ఉద్యమకారులపై ఏకపక్ష కాల్పులు చేపట్టారని అన్నారు. కార్యక్రమంలో విరసం రాష్ట్ర అధ్యక్షులు అరసవెల్లి కృష్ణ, తాండ్ర ప్రకాశరావు, సన్యాసిరావు, పత్రి డానేసు పాల్గొన్నారు. ముందుగా నిర్వహించిన సంస్కృతిక కళాకారులు తమ గీతాలను ఆలోచింపజేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

అనుమానిత ప్రదేశాల్లో విస్తృత తనిఖీలు

ప్రజాశక్తి - పొందూరు

జిల్లాలో గంజాయి వంటి మత్తు పదార్థాల అక్రమ నిల్వలు, రవాణాను అరికట్టే చర్యల్లో భాగంగా పొందూరు, జి.సిగడాం మండలాల్లోని పలు ప్రదేశాల్లో గురువారం డాగ్ స్క్వాడ్‌తో విస్తృత తనిఖీలు చేపట్టారు. పొందూరు ఎస్ఐ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన పోలీసు జాగిలంతో అనుమానిత ప్రదేశాలు, రైల్వేస్టేషన్, ముఖ్య కూడళ్లు, దుకాణాలు, వాహనాల తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్‌లో అనుమానం ఉన్న ప్రయాణికుల లగేజీ బ్యాగులను క్షుణ్ణంగా పరిశీలించి గంజాయి, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, నిల్వలను గుర్తించేందుకు సోదాలు చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల రవాణా, విక్రయానికి పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ, సిబ్బంది

IN THE HON'BLE COURT OF THE III ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) AT: VISAKHAPATNAM
O.S. 1457/2024

Between:
M/s. Varun Finance,
Rep.by its Special Power of Attorney Holder, Kondra Anand ...Plaintiff
And:
Sri Yellibilli Bhanu & another ...Defendants

SUMMONS

To,
Defendant No.2:
Sri Koppala Babu Rao,
S/o. Sundara, R/at D.No.1-58, Main Veedhi, Near Govt. School, Boddam,Srikakulam-532430.

Please take notice that the above named plaintiff has instituted the above suit against you for recovery of suit amount and with subsequent interest and costs, other reliefs and the suit stands posted to **06-05-2025** for your appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **06-05-2025** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, ex-parte as per law.

(By Order of the Hon'ble Court)
TULALA VENKATESWARA RAO,
KURUMUJI KOTESWARA RAO,
Advocates
Visakhapatnam-530002
Cell: 9985747149.

IN THE HON'BLE COURT OF THE V ADDL. DISTRICT AND SESSIONS CUM FAMILY JUDGE AT: VISAKHAPATNAM
F.C.O.P. 1552/2024

Between:
Kuriti Monica @ Burle Monica & others ...Petitioners
And:
Sri Kuriti Siva ... Respondent

NOTICE

To, **The Respondent**:
Sri Kuriti Siva,
S/o. Late Simhachalam, Hindu, aged 34 years,Employee, R/at D.No.3-138, Aditya Nagar Colony, Arasavilli, Srikakulam.

Please take notice that the above named petitioners filed the above petition seeking return of dowry and for other reliefs and in the said petition though the summons were sent to you many a time through Court and R.P., but you have intentionally avoided to receive the same and the Hon'ble Court was pleased to issue notice through this paper publication. The above matter stands posted to **01-05-2025** for your appearance. You have to attend either in person or through your counsel on that day at about **10:30 A.M** in the above stated Hon'ble Court, failing which the matter will be decided in your absence.

(By Order of the Hon'ble Court)
V.S. PAVAN
Advocate for Petitioners,
Visakhapatnam.


నిరసన చేపడుతున్న ఐద్వా నాయకులు, మహిళలు

పెంచిన గ్యాస్, పెట్రో ధరలు తగ్గించాలి

ఐద్వా జిల్లా కన్వీనర్ లక్ష్మి డిమాండ్

శ్రీకాకుళం అర్బన్: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంటగ్యాస్, పెట్రోల్ ధరలు వెంటనే తగ్గించాలని ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని దమ్మలవీధి తదితర ప్రాంతాల్లో ఐద్వా ఆధ్వర్యాన నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర ధరలు, విద్యుత్ ఛార్జీలతో పేద, మధ్యతరగతి ప్రజానీకం సతమతమవుతున్నారని, గోరుచుట్టుపై రోకలి పోటు చందంగా గ్యాస్ ధరలు, పెట్రోల్ ధరలు పెంచడం దారుణమన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ముడిచమురు ధరలు తగ్గుతుంటే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మాత్రం ధరలు పెంచుతూ ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను తుంగలో తొక్కి అడ్డదారులో విద్యుత్ ఛార్జీలను పెంచుతోందన్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం ఏకంగా గ్యాస్ సిలిండర్‌పై రూ.50 పెంచిందన్నారు. ధరా భారాలతో ప్రజలను వేధిస్తే ప్రజలు సహించరని ఆమె హెచ్చరించారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు ఆసప్ప లత, ఎం.లక్ష్మి, పి.జానకి, లక్ష్మి గున్నమ్మ, పొట్నూరు సుందరమ్మ, ఎస్.దేవప్రియ పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విప్ దృష్టికి జర్నలిస్టు కాలనీ సమస్యలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలోని జర్నలిస్టు కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జర్నలిస్టులు కోరారు. ఈ మేరకు కాలనీలో ఆంజనేయస్వామి విగ్రహవిష్కరణలో గురువారం పాల్గొన్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీలో సామాజిక భవన నిర్మాణం ఆవశ్యకమైన స్థలం మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు కొండేటి వెంకటరావు, బాల, అరుణ్, టిడిపి నాయకులు నందిగాం కోటేశ్వరరావు, నందిగా జాని, కౌన్సిలర్లు కాళ్ల దిలీప్, లీలారాణి, కొండ శంకరరెడ్డి, గెడల శేఖర్, నీలపు వెంకట, ధర్మరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సూరయ్య

ఆటో కార్మికులను ఆదుకోవాలి

మెళియాపుట్టి: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య కోరారు. పాతపట్నం సిఐటియు కార్యాలయ ఆవరణలో బి.చంద్రశేఖర్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీమా పథకాన్ని, బ్యాంకు రుణాలను, ఇతర రాయితీలను వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఎం.దిలీప్‌కుమార్, ప్రకాశరావు, శ్రీను, కృష్ణారావు, డబ్బీరు శ్రీను పాల్గొన్నారు.


ధర్నా చౌక్ వద్ద సంతకాల సేకరణలో పాల్గొన్న నాయకులు

ఆప్కాస్‌ను రద్దు చేయొద్దు

ఆమదాలవలస: ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను అప్పగించవద్దని మున్సిపల్ యూనియన్ లీడర్ తాడి సంతోష్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద ఉన్న ధర్నా చౌక్ వద్ద ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆప్కాస్ రద్దును నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించి తమ జీవితాలను అంధకారంలోకి నెట్టవద్దని ప్రభుత్వాన్ని కోరారు. ఒకవేళ ఆప్కాస్‌ను రద్దు చేస్తే తమ ఉద్యోగలను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. మున్సిపల్ యూనియన్ నాయకులు కె.తారకేశ్వరరావు, ఎ.శ్రీనివాసరావు, ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు.


మగ్గం వర్క్‌ను పరిశీలిస్తున్న విద్యార్థులు

వృత్తి విద్యా కోర్సులతో ఉపాధి

పొందూరు: విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల ద్వారా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడంతో ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయని ఒకేషనల్ విద్య కన్సల్టెంట్ బి.రాజశేఖర్, జిడిఒ నీరజాక్షి అన్నారు. స్థానిక ఎపి మోడల్ స్కూల్ అప్పెరల్ అండ్ మేడ్‌ప్స్ ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం క్షేత్రపర్యటనలో భాగంగా ఇంటర్న్ షిప్ నిర్వహించారు. ఈ సందర్భంగా 9, 10 తరగతి విద్యార్థులకు స్థానిక టైలరింగ్ దుకాణాల్లో బోటిక్‌యు, మగ్గం వర్క్స్ పనులపై శిక్షణ అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకర్, జిల్లా ఒకేషనల్ కో-ఆర్డినేటర్స్ బి.తిరుపతి, శంకరరావు, ఒకేషనల్ ట్రైనర్ సీపాన మాలతి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

ఆమదాలవలస : పట్టణంలోని 33/11 కెవి సొట్టవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగించుట కారణంగా ఈ నెల 11న శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంట వరకు తోటాడ, దూసి, అక్కివరం, వంజంగి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అసౌకర్యాన్ని గమనించి విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

కాలువ కప్పేసి రహదారిగా మార్పు

చోద్యం చూస్తున్న అధికారులు

ఆమదాలవలస: మండలంలోని తోటాడ రెవెన్యూ అక్కివరం పంచాయతీ పరిధిలో గల కొత్తరోడ్డు వద్ద ఉన్న ఆర్మీ క్యాంటీన్‌కు ఎదురుగా భాష్యం స్కూలు ముందు భాగాన కాలువను కప్పేసి రహదారిగా మార్చిన వైనాన్ని చూసి రైతులు, ప్రజలు అవాక్కవుతున్నారు. గతంలో ఈ కాలువ గుండా పంట చేనుకు నీరు వెళ్లేదని అటువంటి కాలువను కప్పేసి ఆక్రమించి, చదును చేసి రహదారిగా మార్చడం ఎంతవరకు సబబని పలువురు ప్రశ్నిస్తున్నారు. కొత్త రోడ్డు సమీపంలో ఇప్పటికే ఆక్రమణల జోరు పెరిగిందని, తప్పుడు సర్వే నెంబర్లతో రిజిస్ట్రేషన్లు చేస్తున్నారని పలుమార్లు పలువురు ఏకరువు పెడుతున్నప్పటికీ అధికారుల్లో చలనం లేకపోవడం విస్మయం కలిగిస్తుంది. ఆక్రమణదారులు ఏకంగా కాలువ గట్టునే రోడ్డుగా చేసేశారని దీంతో ఎగువ పొలాల నుంచి దిగువ పొలాలకు వరదలు, తుఫానులు సంభవించినప్పుడు కాల్వ కప్పేయడంతో నీరు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయిందని పలువురు గగ్గోలు పెడుతున్నారు.

నీటి సంఘాల ఎన్నికల్లో రైతులకు అది చేస్తాం ఇది చేస్తామంటూ ఓట్లు అభ్యర్థించి ఇలా కాలువలు కనుమరుగవుతున్న సమయంలో పట్టించు కోకపోవడం సరికాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రాంతానికి చెందిన దూసి నీటి సంఘ అధ్యక్షుడు కలుగజేసుకొని న్యాయం చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు. భవిష్యత్‌లో విజయవాడ మాదిరిగా ఈ ప్రాంతం కూడా ముంపునకు గురికాక తప్పదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతం జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉండటంతో విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, గృహాలు పెద్దసంఖ్యలో ఇక్కడ వెలు స్తున్నాయి. ఆక్రమాలపై దృష్టి సారించాల్సిన సచివాలయ, రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ అధికారులు దృష్టి సారించక పోవడంతో ఆక్రమణల వేగం పుంజు కుంటున్నాయని పలువురు చెబుతుండడం విశేషం. అధికారులు ఇప్పటికైనా స్పందిస్తే భవిష్యత్ తరాలకు మేలు చేసే వారవుతారని పలువురు అభిప్రాయపడుతున్నారు.


రహదారిగా మార్చిన కాలువ

నేడు టౌన్ ప్లానింగ్ సమస్యలపై ఓపెన్ ఫోరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న భవన నిర్మాణదారులు, లైసెన్స్ హోల్డర్లు సాంకేతిక నిపుణుల సమస్యల పరిష్కారానికి వీలుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్నట్టు కమిషనర్ ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణాల క్రమబద్ధీకరణపై చర్చించే అవకాశం ఉందని తెలిపారు.


పనులను పరిశీలిస్తున్న స్వరూపరాణి

'ఉపాధి' పనులు పరిశీలన

మెళియాపుట్టి: మండలంలోని జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని జిల్లా విజిలెన్స్ అధికారి స్వరూపరాణి ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండాను ఆదేశించారు. ఈ మేరకు మెళియాపుట్టిలో చేపడుతున్న ఉపాధి పనులను గురువారం పరిశీలించారు. పనులు సక్రమంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. పనులను చూసి సంతృప్తి చెందారు. ముందుగా మండల కేంద్రంలోని ఉపాధి హామీ కార్యాలయాన్ని సందర్శించారు. గతంలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో గుర్తించిన అభియోగాలకు సంబంధించి వచ్చినట్లు వివరించారు. దస్త్రాలను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. తనిఖీల్లో గుర్తించిన రికవరీలో కట్టాలన్నారు. ఈమెతో పాటు ఎపిఒ రవి, ఇసి ఆది నారాయణరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీరామ్‌చాణిక్య ఉన్నారు.

బోర్ల ఏర్పాటుకు శంకుస్థాపన

మెళియాపుట్టి : మండలంలో స్థానిక ఐకెపి కార్యాలయం, కెజిబివిల వద్ద నూతనంగా ఏర్పాటైన బోర్‌వెల్‌ను ఎంపిడిఒ నరసింహ ప్రసాద్‌పండా గురువారం శంకుస్థాపన చేశారు. తాగునీటి సమస్య దృష్ట్యా వీటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం త్రినాథమ్మ, కెజిబివి ప్రిన్సిపాల్ రమ్య తదితరులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల కొయ్యాంలో గురువారం విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్రశిక్షా ద్వారా సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రా పేరిట నోట్ పుస్తకాలను కళాశాల ప్రిన్సిపాల్ కీర్తి తవిటినాయుడు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు ఎంతో వరమని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సనపల షణ్ముఖరావు, నడిమింటి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

పింఛను మంజూరు చేయరూ...

ప్రజాశక్తి- నందిగాం


రత్నాలమ్మ

మండలంలోని అన్నాపురానికి చెందిన తన భర్త సోనాపురం అప్పన్న ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందారని ఆయన భార్య రత్నాలమ్మ తెలిపింది. తన భర్త మృతి చెందితే తాను మృతి చెందినట్లు అధికారులు తప్పిదం చేసి రికార్డులో నమోదు చేశారని అన్నారు. దీంతో పింఛను నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను పూరె గుడిసెలో ఉంటూ జీవనం సాగిస్తున్నారని అన్నారు. అయితే తన భర్తకు పింఛను వచ్చేదని, ఆ పింఛను తనకు ఇప్పించాలని అధికారుల చుట్టూ తిరిగినా స్పందించడం లేదని వాపోయింది. ఉన్నతాధికారులు స్పందించి పింఛను మంజూరు చేయాలని కోరారు.

వసతిగృహ నిర్మాణ స్థలం పరిశీలన

పాతపట్నం : రూ.2.30 కోట్లతో నిర్మించనున్న ప్రధానమంత్రి జన్మాన్ వసతి గృహ నిర్మాణ స్థలాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం అధికారులతో పరిశీలించారు. హాస్టల్ నిర్మాణ పనులు అత్యంత నాణ్యతతో త్వరితగతిన ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. నిర్మాణంలో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు.

పౌష్టికాహార వారోత్సవాలు

పాతపట్నం : పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండలంలోని తెంబూరు హోమియో వైద్యులు ఉమాగౌరీ పెద్దలక్ష్మీపురంలో గర్భిణులకు, బాలింతలకు, కౌమార దశలో ఉన్న యువతులకు పౌష్టికాహారం వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పౌష్టికాహారం ఎంత మేరకు తీసుకుంటే పుట్టబోయే పిల్లలకు, తల్లులకు అంత మేలు చేకూరుతుందన్నారు. అనంతరం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అన్నెపు ఉమామహేశ్వరరావు, తెంబూరు, పెద్దలక్ష్మీపురం అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

స్మార్ట్‌మీటర్లు వద్దు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- కొత్తూరు

ఇళ్లకు విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించవద్దని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కొత్తూరులో 'మా ఇంటికి స్మార్ట్ మీటర్లు వద్దు - విద్యుత్ ఛార్జీలు తగ్గించాలి' డిమాండ్ చేస్తూ... గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ అమర్చి అదానీకి ప్రజల సొమ్మును దోచుపెట్టేందుకు తీసుకున్న నిర్ణయాలను సిపిఎం వ్యతిరేకిస్తుందన్నారు. విద్యుత్ రంగాన్ని కూటమి ప్రభుత్వం, గత వైసిపి ప్రభుత్వం కేంద్రంలోని బిజెపితో కలిసి అదానీ లాభాలే లక్ష్యంగా పనిచేస్తున్నాయన్నారు. స్మార్ట్ మీటర్లు ఇంటింటికీ అమర్చి ప్రజలను కష్టాన్ని దోపిడీ చేయాలని చూస్తున్నారని విమర్శించారు. రూ.17 కోట్లు సర్దుబాటు ఛార్జీల పేరుతో ఇప్పటికే భారాల వేసి ప్రజల నడ్డి విరిచారని, ఇప్పుడు అలానే మీటర్లు ప్రజల మెడకు తగిలించి మరో దోపిడీకి సిద్ధపడుతున్నారని అన్నారు. దీనిని ప్రజలంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్పొరేట్ కంపెనీ అధిపతుల లాభాల కోసం కేంద్రం ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా సిపిఎం నాయకులు ఇంటింటా ప్రచారం చేపడతామన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, ఎస్.ముఖలింగం పాల్గొన్నారు.

పేదలు, అమాయకులే లక్ష్యం

పూజల పేరుతో దోపిడీ

ప్రజాశక్తి- టెక్కలి

'మీరు ఎంత కష్టబడుతున్నా మీ దగ్గర డబ్బు నిల్వడం లేదు'... 'మీ ఇంటిలో వాస్తు దోషం ఉంది'... 'శని గ్రహం ప్రభావం కూడా మీపై ఉండడంతో మీకు మనశ్శాంతి ఉండడం లేదు'... ఇవన్నీ పోవాలంటే మీ ఇంటిలో పూజ పెట్టాలి. పూజలు చేయాలి దోషం వదుల్చుకోండి' అంటూ ఇద్దరు వ్యక్తులు గ్రామాల్లో తిరిగుతున్నారు. ఈ తరుణంలో అందిన కాడికి దోచుకుంటున్న వైనం టెక్కలిలో చర్చనీయాంశమవుతుంది. మండలంలోని నర్సింగపల్లి పంచాయతీ పరిధిలోని నర్సింగపల్లి, కిట్టాలపాడు, రాంపురం గ్రామాల్లో కొద్ది రోజులుగి ఇద్దరు వ్యక్తులు ఇంటింటికీ తిరిగి పూజలు చేస్తామని చెబుతున్నారు. పేదలు, అమాయకులను లక్ష్యం చేసుకుని పూజలు పేరుతో వేలాది రూపాయలు దండుకుంటున్న మోసం బయటపడుతుంది. పూజల పేరుతో ఇంటిలో కొద్ది సేపు హడావుడి సృష్టించి వేలాది రూపాయలు దోషం నివారణ పేరుతో గుంజుకుంటున్నారు. పూజ జరిగిన తర్వాత కొద్ది గంటల వరకు ఈ విషయం ఎవ్వరికీ చెప్పవద్దని దోష నివారణ కోసం ఎంత ఇచ్చామనీ చెప్పవద్దు... ఆలా చెబితే పూజ చేసిన కార్యమంతా వృథా అవుతుందని నమ్మబలికి అక్కడి నుంచి తప్పించుకుంటున్నారు. ఈ విషయంలో ముందుగా నగదు చెల్లించిన వారు మోసాన్ని గ్రహించి తమకు పూజలు వద్దని, తాము చెల్లించిన నగదు తిరిగి ఇచ్చివేయమని కోరుతున్న సమయంలో వాగ్వివాదాలు చోటుచేసుకోవడం గమనార్హం. ప్రజల మూఢత్వాన్ని ఆసరాగా చేసుకుని పూజల పేరుతో సొమ్ములు సంపాదించేందుకు చేస్తున్న కొత్తతరహా మోసాలు బయటపడుతుండడంతో ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పై మూడు గ్రామాల్లో ఇప్పటికే చాలా మంది వద్ద పూజల పేరుతో వసూళ్లు చేసుకుని వేలాది రూపాయలతో పలాయనం చిత్తగించే వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. కాగా, ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు కూడా ఎవ్వరూ ముందుకు రాకపోవడం విశేషం.

'ఉపాధి' పనులు ప్రారంభం


టెక్కలి రూరల్ : పనులను ప్రారంభిస్తున్న జగదీశ్వరరావు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లి పంచాయతీ పరిధి రంగనాథపేట, మున్షీపేటలో గురువారం ఉపాధిహామీ పనులను మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు కూన వెంకటసత్యారావు, జిల్లా టిడిపి కార్యదర్శి సీపాన శ్రీరంగనాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు పూటలా ఉపాధిహామీ పనుల్లో పాల్గొనడం వలన అధికంగా కూలీని పొందవచ్చునని కూలీలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, నీటిసంఘం అధ్యక్షులు జి.రాము తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : మండలంలోని రావివలస పంచాయతీ చిన్ననారాయణపురంలోని బొడ్డరాముడు చెరువులో ఉపాధి హామీ పనులను యాదవ సంక్షేమ, అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జగదీశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పనులతో చెరువు అభివృద్ధి చెందుతాయని, కూలీలకు ఉపాధి దొరుకుతుందని అన్నారు. కార్యక్రమంలో రావివలస మాజీ సర్పంచ్ జగదీష్, ఎంపిటిసి మాజీ సభ్యులు కృష్ణారావు, ఎపిఒ ప్రసాదరావు, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు శ్రీనుబాబు, వాసు, మల్లేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

'ఊయల' ప్రారంభించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని కొండములగాం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఊయల కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. రణస్థలం ఐసిడిఎస్ పిఒ ఝాన్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు పాల్గొన్నారు. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఊయలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసిపిల్లలు వద్దనుకొనేవారు ఈ ఊయలలో వేయాలన్నారు. ఆడపిల్లలని, అనారోగ్య వంతులని, అంగవైకల్యం కలవారని లేదా అవాంఛిత గర్భం వలన పుట్టిన పసి పిల్లలను వద్దనుకుని వారిని చెత్త కుండీలు, ముళ్ల పొదలు లేదా బయట పారవేయకుండా ఈ ఊయలలో వేయాలన్నారు. వారిని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ వారి శిశు గృహంలో సంరక్షించి పిల్లల కోసం ధరఖాస్తు చేసుకున్న తల్లిదండ్రులకు చట్టబద్ధంగా దత్తత ఇస్తామన్నారు. ముందుగా బాలింతలను పరామర్శించి పండ్లను పంపిణీ చేశారు. పసి పిల్లలకు 6 నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టాలని వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి గొర్లె లక్ష్మణరావు, సిహెచ్‌సి మాజీ చైర్మన్ వెలిచేటి సురేష్, పిసిని జగన్నాథం నాయుడు, దన్నాన సత్తిబాబు, ఆస్పత్రి డైరెక్టర్ దన్నాన స్వామి నాయుడు, దన్నాన వంశీ, వెలిచేటి రామకృష్ణ, దన్నాన రవీంద్ర, వైద్యులు పైడి లలిత, శిరీష, క్రాంతికుమార్, ప్రసన్న లక్ష్మి, పద్మావతి, వంశీ ప్రియ, సిబ్బంది జాక రమణ తదితరులు పాల్గొన్నారు.


ఊయలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

23, 24న జాతీయస్థాయి సాహితీ పోటీలు


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాగేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 23, 24 తేదీల్లో జాతీయ స్థాయి సాహిత్య పోటీలు నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు కళాశాల ఆవరణలో 'జాతీయ స్థాయి లిట్. ఫెస్ట్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిగ్రీ, పిజి స్థాయి విద్యార్థుల్లో సాహిత్య పరంగాదాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ పోటీల్లో భాగంగా ఫ్లాష్ ఫిక్షన్ (200-300 పదాలు), స్క్రీన్ రైటింగ్ (చిన్న స్క్రీన్ప్లే), లిటరేచర్ క్విజ్, ఫిల్మ్ రివ్యూ ఛాలెంజ్ (5 నిముషాల సమీక్ష), డ్రామాటిక్ పెర్ఫార్మెన్స్ (నటన లేదా కవిత్వ పఠనం, కవితా రచనలు వంటి వివిధ అంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు వివరించారు. ప్రారంభ సమావేశంలో ఐఐటి భువనేశ్వర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజ్కుమార్ గూడురు పాల్గొని ప్రసంగిస్తారన్నారు. ఎంపిక చేయబడిన అంశాలను డిఒఐ, ఐఎస్బిఎన్ నంబర్లతో అధ్యయన పుస్తకాన్ని ప్రచురిస్తారని, విజేతలకు ప్రశంసాపత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, బిఎస్ఇండ్ హెచ్ విభాగాధిపతులు డాక్టర్ రత్నమణి, డాక్టర్ ఎం.రమణయ్య, డాక్టర్ పాపినాయుడు, నడిమింటి శైలజల పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు అధిక సంఖ్యలో పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు.

ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పలాస: ఆర్‌టిసి సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని నేషనల్ మజ్దూర్ యూనిట్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. పలాస ఆర్‌టిసి డిపో వద్ద గురువారం ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లను, అక్రమ రిమూవల్స్‌ను ఆపాలన్నారు. తక్షణమే ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జిఒ ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని కోరారు. నాన్ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం చెల్లించాలన్నారు. ఇహెచ్‌ఎస్ స్థానంలో పాత వైద్య విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం, సంస్థ ద్వారా మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. 114 జిఒలో పొందినపరిచిన మేరకు నైట్ అవుట్ అలవెన్స్‌లు రూ.400 చెల్లించాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలన్నారు. ఉద్యోగుల అవసరాలను బట్టి ఇఎల్‌లు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.వాలి, డి.ఎల్.నారాయణ, ఎ.వి.రావు, టి.డి.రావు, టి.పార్వతీశం, ఎన్.నారాయణ, వై.అప్పయ్య హెచ్.వి.మూర్తి, డి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

టెక్కలి : ఆర్‌టిసి కార్మికులను నిర్వీర్యం చేస్తూ... హక్కులను కాలరాసే ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ ఎన్ఎంయు ఆధ్వర్యాన డిపో వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘ నాయకులు డి.బి.కె.రాజు, రమేష్, కిషోర్, బాబూరావు పాల్గొన్నారు.


పలాస : డిపో వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

కిడ్నీ వ్యాధితో వ్యక్తి మృతి

టెక్కలి : మండలంలోని గూడెం పంచాయతీ సన్యాసినీలాపురానికి చెందిన బెహరా సింహాద్రి (45) కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గురువారం మృతి చెందారు. కొన్నేళ్ల నుంచి ఈయన కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నారు. గురువారం పరిస్థితి విషమించడంతో మృత్యువాత పడ్డాడు. సింహాద్రి భవన నిర్మాణ కార్మికునిగా పనిచేస్తున్నారు. ఈయనకు భార్య కృష్ణవేణి, కుమార్తెలు మానస సంధ్య, ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


చెట్టుకు వేలాడుతున్న మృతదేహం

పాతపట్నం : మండలంలోని పాసి గంగుపేట తోటలో వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... హైదబాద్‌కు చెందిన మహమ్మద్ షఫి పాసిగంగుపేటకు చెందిన రాములమ్మతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. గురువారం తోటలో చెట్టుకు వేలాడుతూ కనిపించడంతో గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్ఐ బి.లావణ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

లారీ డ్రైవర్‌కు జైలు శిక్ష

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని రెడ్డిపేట సమీపంలో 2019 ఆగస్టు 15 జరిగిన రహదారి ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడడానికి కారణమైన లారీ డ్రైవర్ కిల్లాపు శ్రీనుకు ఒక ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ గురువారం పొందూరు జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బి.జోత్స్న తీర్పును వెల్లడించారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు 2019 ఆగస్టు 15న పొందూరు మండలం కృష్ణాపురానికి చెందిన అంబల్ల సంతోష్, చీమల మణికంఠలు శ్రీకాకుళంలో తన చెల్లికి రాఖీ కట్టేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నారు. రెడ్డిపేట - లోలుగు కాలనీ మార్గమధ్యంలో అదే గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ కిల్లాపు శ్రీను అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టాడు. దీంతో సంఘటన స్థలంలోనే సంతోష్ మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మణికంఠను 108 ద్వారా శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. ఈ ప్రమాదంపై మృతుడు సంతోష్ తండ్రి దుర్గారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ మహమ్మద్ యాసిన్ కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ రొక్కం శాంతి సంతోషి వాదనలు వినిపించారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో ముద్దాయికి జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు.

రైల్వే గేటును ఢీకొన్న వ్యాన్

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ రైల్వే గేటును లగేజ్ వ్యాన్ గురువారం ఢీకొట్టడంతో విరిగిపోయింది. చినబడాం నుంచి కాశీబుగ్గ వైపు లగేజ్ వ్యాన్ వస్తుండగా అదే సమయంలో గేటు వేస్తున్నారు. గేటు వేసేలోపు వెళ్లిపోవాలనే ఉద్దేశంతో వ్యాన్ డ్రైవర్ వేగంగా వెళ్లడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గేటు విరిగి పడిపోవడంతో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. పాడైన రైల్వే గేటును తొలగించి కొత్త రైల్వే గేటు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో రైల్వే గేటుకు ఇరు వైపులా వాహనాలు బారులు తీరాయి. ఇదిలా ఉండగా ఆ సమయంలో వేడి ఎక్కువగా ఉండడంతో వాహన చోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


సత్కరిస్తున్న నాయకులు, విద్యార్థులు

ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి- కవిటి

మృదంగ విద్వాంసుడు, ఉగాది పురస్కార గ్రహీత ప్రొఫెసర్ బొంతల కోటి సత్యవరప్రసాద్‌కు ఆత్మీయ సత్కారం లభించింది. కవిటి కళ్యాణి ఆంగ్ల పాఠశాలలో విద్యార్థులు, నాయకులు వరప్రసాద్‌కు గురువారం చిరు సత్కారం చేశారు. ఈ సందర్భంగా కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి లోల్ల రాజేష్ మాట్లాడుతూ సంగీత ప్రపంచంలో ఉద్దానం కీర్తి మరోసారి చాటారని కొనియాడారు. భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్, బల్లెడ రమేష్, ఉద్దానం కళాకారులు పూడి వెంకటేశం, ఆరింగి వెంకట్రావు, చలపరాయి రవి, రాంబాబు, బొర్ర హరి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సింహాచలం

'ఉపాధి' బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి- కొత్తూరు

పెండింగ్ ఉన్న ఉపాధి హామీ బకాయిలను తక్షణమే చెల్లించాలని ఎపి కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు కొత్తూరులోని కూలీలతో గురువారం మాట్లాడారు. జనవరి నుంచి ఇప్పటి వరకు ఉపాధి బకాయిలు ఉన్నాయన్నారు. అలాగే పనిప్రదేశంలో మౌలిక సదుపాయాలైన టెంట్లు, తాగునీరు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. పేదలకు పట్టెడు అన్నం పెడుతున్న ఉపాధి హామీకి కేంద్ర బడ్జెట్‌లో నిధులు తగ్గించడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వం ఉపాధిని వ్యవసాయానికి అనుసంధానం చేసి పేదల పొట్ట కొడుతుందన్నారు. ఉపాధి హామీ రక్షణకు, సాధనకు, బకాయిల కోసం ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

కాలుష్య కోరల్లో గ్రామాలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలోని పలు గ్రామాల పంట పొలాల్లో ఉన్న పంట వ్యర్థాలను కాలుస్తుండడంతో గ్రామాలు కాలుష్య కోరల్లో చిక్కుకుంటున్నాయని ఎపి ఎన్‌జిసి జిల్లా కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులు తమ పంట పొలాల్లో ఉన్న వ్యర్థాలకు నిప్పు పెట్టడం వలన అగ్ని జ్వాలలు చెలరేగి పరిసర ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో విపరీతమైన కాలుష్యం పెరుగుతుందని, ముఖ్యంగా మండలంలోని బెలమాం,



పొలాల్లో కాలుతున్న వ్యర్థాలు

లొద్దలపేట పరిసర గ్రామాల పొలాల్లో పంట వ్యర్థాలను విపరీతంగా కాలుస్తున్నారన్నారు. దీనివలన పర్యావరణానికి హాని కలగడమే కాకుండా రైతులకు కూడా నష్టం కలుగుతుందన్నారు. పంట పొలాల్లో అగ్ని జ్వాలలు రగులుతున్న సమయంలో పరిసర గ్రామాలతో పాటు సమీప రహదారిలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు అగ్ని వేడితో పాటు పొగను పీల్చుతూ తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు అవగాహన లేక ఈ విధంగా చేయడం ద్వారా పొలాల్లో రైతులకు సహాయపడే కీటకాలు చనిపోతున్నాయన్నారు. పంట వ్యర్థాలను పొలంలో పారవలే వేస్తే అవి కుళ్లి నేలను సారవంతం చేస్తాయన్నారు. సారవంతమైన నేల ఖరీఫ్ సాగు చేసే రైతులకు ఎంతగానో ఉపయోగపడి సస్యశ్యామలమైన పంటను అందిస్తుందని, ఈ విషయంపై సచివాలయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించాలని గోవిందరావు కోరారు.



చేరిక పత్రాన్ని అందజేస్తున్న రామకృష్ణ

ప్రభుత్వ బడిలో చదివించాలి

కోటబొమ్మాళి: విశాలమైన తరగతి గదులు, ఆహ్లాదకరమైన వాతావరణం, అనుభవం, అర్హత, మౌలిక సదుపాయాలు కలిగి ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోని తమ పిల్లలను చదివించాలని మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ అన్నారు. మండలంలోని తిలారు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చదివించాలని గురువారం ర్యాలీ నిర్వహించారు. బడిఈడు పిల్లలు ఉన్న ఇంటింటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సంక్షేమం, విద్య అంశాలను తల్లిదండ్రులకు వివరించారు. తమ పిల్లలకు ప్రభుత్వ పాఠశాల్లోనే చేర్పించాలని కోరారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఈ పాఠశాల మోడల్ ప్రైమరీ పాఠశాలగా మారుతుందని, ఒక్కో తరగతికి ఒక్కో ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులకు మరింత మెరుగైన భోధన అందుతుందని వివరించారు. అనంతరం పలువురు విద్యార్థులను పాఠశాలలో జాయిన్ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.ఎ.ఎస్.నాయుడు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఇఒ అప్పారావు

పాఠశాల డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక జ్ఞాన భారతి పాఠశాల ఆవరణలో పాఠశాల-2025- 26 విద్యా సంవత్సరానికి సంబంధించిన డైరీని కార్యదర్శి, ముఖ్య కార్యనిర్వాహణాధికారి జోహార్‌ఖాన్ ఆధ్వర్యాన ఎంఇఒ కె.అప్పారావు గురువారం ఆవిష్కరించారు. ఎంఇఒ మాట్లాడుతూ విద్యా సంవత్సరానికి సంబంధించిన వివరాలతో కూడిన డైరీ విద్యార్థులకు ఎంతో ముఖ్యమైందన్నారు. డైరీ విద్యార్థుల్లో క్రమ శిక్షణను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. జోహార్ ఖాన్ మాట్లాడుతూ ్గత విద్యా సంవత్సరంలో పాఠశాలలో నిర్వహించిన అన్ని కార్యక్రమాల ఫొటోలను డైరీలో ముద్రించామని తెలిపారు. విద్యార్థుల చిత్రాలను, ప్రదర్శించిన ప్రతిభను, వివిధ రంగాల్లో సాధించిన విజయాలను డైరీలో పొందుపర్చడం ఆనందంగా ఉందన్నారు. కార్యనిర్వాహక ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ప్రధానోపాధ్యాయులు రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అదనపు పరిపాలన అధికారిని సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, పిఇటిలు కైలాస్‌కుమార్, డి.రాము పాల్గొన్నారు.

సి.వై చింతామణికి ఘన నివాళి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల



చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న అధ్యాపకులు

ప్రముఖ సంపాదకులు, రాజనీతజ్ఞుడు, రచయుత చిర్రావూరి యజ్ఞేశ్వర (సి.వై) చింతామణికి డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ విభాగం ఘననివాళ్లర్పించింది. సి.వై జయింతి సందర్భంగా ఆయన చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి జర్నలిజం, సామాజిక, రాజకీయ రంగాల్లో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విభాగం అధ్యాపకులు, విద్యార్థులు మాట్లాడారు. ఉత్తరాంధ్రలో పుట్టి ఎంతో మంది జర్నలిజం రంగంలో జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు సాధించారన్నారు. అదే కోవకు సి.వై చెందుతారన్నారు. మదన్ మోహన్ మాలవ్య మానస పుత్రికైన అలహాబాద్‌లోని 'లీడర్' ఆంగ్ల పత్రికకు 32 ఏళ్ల పాటు సంపాదకత్వం వహించడం తెలుగువారికి ఎంతో గర్వకారణమన్నారు. అదే విధంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్ర రాజకీయాల్లో కూడా రెండు దశాబ్దాల పాటు ప్రభావిత పాత్ర పోషించారన్నారు. ఆ తరం వారు పాటించిన విలువలు, సమాజహితం కోరే రచనలు పాత్రికేయ వృత్తికే వన్నె తెచ్చాయన్నారు. సి.వై ఆశయాలు నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. డా. ఆర్. తిరుపతిరావు, డా. జి.ఎల్.వి. ప్రసాద్, డా. వై.డి. రామదాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పల్లెనిద్ర

శ్రీకాకుళం అర్బన్: సిఎం చంద్రబాబు ఆదేశాలను అనుసరించి గార మండలం బందరువానిపేటలో శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఎమ్మెల్యే గొండు శంకర్ పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. శనివారం ఉదయం 10 గంటల వరకు అక్కడే ఉండి మత్స్యకారులతో సహపంక్తి భోజనం చేస్తారని కార్యాలయం నుంచి ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజల సమస్యలు నేరుగా తెలుసుకునేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజక వర్గం పరిధిలో ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన సూచించారు.

బస్సు డ్రైవర్‌పై దాడి

ఎచ్చెర్ల రణస్థలం మండలం ఎన్‌ఇఆర్ స్కూల్ బస్ డ్రైవర్ మన్నే రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై ఎచ్చెర్ల పోలీసులు ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ వి.సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలం అరిణాం అక్కివలస పంచాయతీ నాగార్జున అగ్రికమ్ పరిశ్రమ సమీపంలో స్కూల్ బస్సు వెళ్తుండగా ట్రాక్టర్ ఎదురుగా రావటంతో ఇరువాహన డ్రైవర్లకు వాగ్వివాదం జరిగింది. ఈ క్రమంలో శ్రీకాకుళం నగరంలోని సీపన్నాయుడుపేటకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు అన్నెపు రమణ, లక్షణరావు బస్సు డ్రైవర్‌పై దాడి చేసినట్లు డ్రైవర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మెడల్‌ను బహుకరిస్తున్న జగన్మోహనరావు

రక్తదాతలు... ప్రాణదాతలు

కవిటి: రక్తదాతలు ప్రాణ ప్రదాతలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు పి.జగన్మోహనరావు అన్నారు. ఇప్పటి వరకూ అత్యధిక సార్లు రక్త దానం చేసిన వారిని గురువారం శ్రీకాకుళంలో నిర్వహించి ఓ కార్యక్రమంలో సత్కరించారు. అందులో భాగంగా కవిటి మండలం ఎర్రగోవిందపుట్టుగకు చెందిన ఈపరి రమణమూర్తిని ఐఆర్‌సిఎస్ మెడల్‌తో సత్కరించారు. రమణమూర్తి 2006 నుంచి ఇప్పటి వరకూ 23 సార్లు రక్తదానం చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించేలా ప్రోత్సహించేవారు.

రేడియం స్టిక్కర్ డ్రమ్ములు అందజేత

పొందూరు : మండలంలోని కేశవదాసుపురం సమీపంలో గల ఎన్‌పిసిఎల్ కంపెనీ రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌కు 20 రేడియం స్టిక్కర్ డ్రమ్ములను అందజేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ అందజేసిన ఈ డ్రమ్ములను ప్రధాన కూడళ్లతో పాటు రహదారి ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణకు కంపెనీ అందిస్తున్న ప్రోత్సాహం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కంపెనీ ప్రతినిదులు, తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

రణస్థలంలో అన్నదానం

రణస్థలం: మండల కేంద్రంలో ఉన్న శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారి 21వ జాతర వార్షికోత్సవం సందర్భంగా సీతంవలస, గొల్లపేట, జె.ఆర్.పురం పంచాయతీ ఉపాధిహామీ కూలీల సహాయ సహకారాలతో భారీ అన్నసమరాదన కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి పిన్నింటి సాయికుమార్, జడ్‌పిటిసి టొంపల సీతారాముడు, రాయపురెడ్డి భుజంగరావు, సూరిబాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తాడివలస ఎపిజిబివి బ్రాంచ్ మేనేజర్ టి.అంకాల్ అన్నారు. గురువారం మండలంలోని బెలమాంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్ కార్డు, బ్యాంకు అకౌంట్ వివరాలు అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. ఎటిఎం కార్డు వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే నగదు రహిత లావాదేవీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్



అవగాహన కల్పిస్తున్న మేనేజర్ అంకాల్

జ్యోతి యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకంపై అవగాహన కల్పించారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్మెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సోషల్ సొసైటీ ట్రాన్స్ఫర్మేషన్ సిబ్బంది చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను), జిల్లా కో-ఆర్డినేటర్ ఎ. హరనాథ్, లీడ్ బ్యాంకు ఫెసిలిటీ లిటరేచర్ కౌన్సిల్ సువ్వారి రవి బాబు, వెలుగు సిఎఫ్ వి. పావని, బి.జగ్గమ్మ, సిఎఫ్ఎల్ సిబ్బంది బొడ్డేపల్లి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధిత విద్యార్థికి ఆర్థికసాయం



డయాలసిస్ పొందుతున్న గణేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలోని ఎచ్చెర్ల మండలం అల్లినగరం గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలుడు గొర్లె గణేష్‌కు రెండు కిడ్నీలు పాడై ఆస్పత్రిలో చేరాడు. చిన్నతనంలోనే స్కూల్‌లో తోటి విద్యార్థులతో కలిసి సరదాగా గడిపే గణేష్ అకస్మాత్తుగా అస్వస్థతకు గురయ్యాడు. తండ్రి పైడిరాజు, తల్లి లక్ష్మి విద్యార్థిని చికిత్స కోసం నగరంలోని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించారు. పరీక్షల అనంతరం రెండు కిడ్నీలు దెబ్బతిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. పేదరికంలో ఉన్న తల్లిదండ్రులు దిక్కుతోచని స్థితిలో ఆవేదన చెందుతున్నారని తెలుసుకుని అల్లినగరం జెడ్‌పి హైస్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు రూ.66, 500 పోగు చేసి గురువారం ఆస్పత్రిలో తల్లిదండ్రులకు అందజేశారు. అలాగే గ్రామానికి చెందిన పలువురు ఆకుటుంబాన్ని ఆదుకోవాలన్న ఆలోచనతో రూ.50వేలు ఆర్థికసాయాన్ని అందించారు. అలాగే శ్రీకాకుళం యూనియన్ బ్యాంక్ (ఆంధ్రా బ్యాంక్) రీజినల్ ఉద్యోగులు రూ.15 వేలు, జూహిత్ నందన్ కృష్ణ టస్ట్ నుంచి రూ.10 వేలు సాయాన్ని బాదిత కుటుంబానికి అందజేశారు. బాలుని కుటుంబాన్ని ఆదుకునేందుకు దాతలు ముందుకొచ్చి సాయం అందించాలని రెడ్‌క్రాస్ సభ్యులు నంది ఉమాశంకర్ కోరారు.

హోమియోకు ప్రపంచస్థాయి గుర్తింపు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఒత్తిడి, ఆందోళన లేకుండా ఆనందంగా జీవించడానికి హోమియో వైద్యం ఒక్కటే ఉపకరిస్తుందని స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల ఇందిరా ప్రసాద్, పీజీ గుప్తా, శాసపు జోగినాయుడు, గుడ్ల సత్యనారాయణ, గుడ్ల జగ్గారావు అన్నారు.. వందల ఏళ్ల చరిత్ర కలిగిన ఏకైక వైద్య విధానం హోమియోతో సాధ్యమన్నారు. గురువారం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రపంచ హోమియో దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కో-ఆర్డినేటర్ జోగినాయుడు మాట్లాడుతూ నేటి ఆధునిక యుగంలో ప్రతిఒక్కరూ ఒత్తిడి, ఆందోళనకు గురి కావడం ఖాయమని, అనేకరకాల వ్యాధులు దరి చేరుతాయని, వీటి నుంచి ఉపశమనం పొందాలంటే హోమియో వైద్యం ఒక్కటే శరణ్యమన్నారు. కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గేదెల లక్ష్మి, అడపా శాంతి, వానపల్లి జ్యోతి, ఎన్.ఉపేంద్ర, ఎం.మల్లిబాబు, నంధిగాన కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కవిటి : ప్రస్తుత రోజుల్లో హోమియో వైద్యానికి ఆదరణ



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న వాకర్స్ ప్రతినిధులు

లభిస్తోందని సోంపేట ఎంపిపి డాక్టర్ నిమ్మన దాసు, కవిటి వైస్ ఎంపిపి పూడి నేతాజీ, జగతి సర్పంచ్ పూడి వరప్రసాద్ అన్నారు. ప్రపంచానికి హోమియో వైద్యం పరిచయం చేసిన శామ్యుల్ హనీమాన్ 270వ జయంతి వేడుకలు గురువారం జగతిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా హనీమాన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత పదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లో సగానికిపైగా ప్రజలు హోమియో వైద్యం వైపు దృష్టి పెట్టారని అన్నారు. కార్యక్రమంలో హోమియో వైద్యులు దుర్గాప్రసాద్ పట్నాయక్, బి.అనురాధ, సుబ్బారెడ్డి, గోవింద్ పాల్గొన్నారు.

మోడల్ పద్ధతులతో అధిక ఆదాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ప్రకృతి వ్యవసాయ విభాగంలో భాగంగా నేషనల్ మిషన్ ఆన్ నేచరల్ ఫార్మింగ్‌పై అనకాపల్లిలో మూడవ రోజు శిక్షణ కార్యక్రమాన్ని రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 365 రోజుల పాటు పలు రకాల పంటలతో పంటల సరళికి అనుగుణంగా పంటలు సాగు చేయాలని తెలిపారు. క్షేత్రస్థాయిలో రైతులు ఒక నిర్దిష్టమైన మోడల్ పద్ధతుల్లో అధిక ఆదాయాన్ని పొందగలిగేలా కార్యాచరణతో పంటలు సాగు చేసుకునేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ఈ శిక్షణా కార్యక్రమంలో పంటల సరళికి అనుగుణంగా వైవిధ్యతతో కూడిన పంటల సాగు విధానాలను



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న రీజనల్ అధికారులు

సిబ్బందితో చార్ట్ రాయించి ప్రజెంటేషన్ చేయించారు. ఎ- గ్రేడ్, ఎటిఎం మోడల్స్‌లో అధిక దిగుబడులు వచ్చేలా రైతుకు నెలకు రూ.25 వేలు రావాలంటే ఏ విధంగా పంటలు సాగు చేయాలో వివరించారు. కార్యక్రమంలో అనకాపల్లి డిపిఎం లచ్చన్న, ఎస్ఎఫ్ఎస్ గోవింద్ రెడ్డి, చిన్న, శిక్షణా సిబ్బంది పాల్గొన్నారు.



ట్రై సైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

ట్రై సైకిళ్ల పంపిణీ

కొత్తూరు : మండల పరిషత్ కార్యాలయంలో వికలాంగులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ట్రై సైకిళ్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. వికలాంగులకు రూ.6 వేలు పింఛను పంపిణీ చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపిపి సవర సావిత్రి, టిడిపి నాయకులు మాతల గాంధీ, అగతముడి అరుణకుమార్, లోతుగడ్డ లక్ష్మీనారాయణ నాయుడు, అగతముడి మాధవరావు, కొమరపు వెంకటరావు, వెంకటకృష్ణ, చోడవరపు రాము, పి.లక్ష్మణరావు, టి.తిరుపతిరావు, దశరథ పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న అప్పలరాజు

మాజీ మంత్రి పరామర్శ

పలాస : వజ్రపుకొత్తూరు మండలం రాజాం మాజీ సర్పంచ్, ఎంపిటిసి ప్రతినిధి పిట్ట రామారావు అనారోగ్యంతో కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రిలో చికిత్సలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు గురువారం ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్యం పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏమి అధైర్య పడవద్దని భోరోసా ఇచ్చారు. ఎప్పుడూ ఏ అవసరం వచ్చినా తానకు ఫోన్ చేస్తే తక్షణమే సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆయనతో పాటు మందస ఎంపిపిడొక్కరి దానయ్య, మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, వైసిపి మండల అధ్యక్షుడు దువ్వాడ రవి కుమార్, పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి ఉన్నారు.



మాట్లాడుతున్న హెచ్ఎం శ్రీధర్

ప్రాథమిక విద్య తప్పనిసరి

ప్రజాశక్తి- కవిటి

ఐదేళ్లు నిండిన బాల బాలికలకు ప్రాథమిక విద్య తప్పనిసరిగా ఉండాలని బొరివంక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్ సూచించారు. ఈ మేరకు గురువారం ఎన్ఆర్‌జిఎస్ వేతనదారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక విద్య బలోపేతానికి ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తల్లిదండ్రులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఐదేళ్లు నిండిన తమ పిల్లలను స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ బృందావన్ బిసాయి పాల్గొన్నారు.

అరసవల్లిలో పండితులకు సత్కారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి వార్షిక కళ్యాణమహోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో పండితులకు ఆలయ ఇఒ వై.భద్రాజీ, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మలు ఘనంగా సత్కరించారు. సదస్యం, మహాదాశీర్వచనం కార్యక్రమంలో భాగంగా ఈ సత్కారాన్ని పండితులు స్వీకరించారు. చైత్రశుద్ధ త్రయోదశి కావడంతో వేద స్వస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఇప్పిలి కాశ్యప శర్మ, బంకుపల్లి రమేష్ శర్మ, భాస్కరబట్ల నరసయ్య శర్మ, ఫణీంద్ర శర్మ, రంజిత్ శర్మ, పెంట శ్రీనివాస శర్మ, రంప సాయి అవధాని, ఆరవెల్లి శ్రీరామ శర్మ, జాడ సూర్యనారాయణ, వెంకట రమణ శర్మ, అంపోలు రుద్ర కోటేశ్వర శర్మ, వేమకోటి సూర్యనారాయణ శర్మ, శ్రీరామమూర్తి, పులకండ శ్రీనివాసరావు, సూర్యనారాయణ, సాయి కుమార్ తదితరులను సత్కరించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి- గుజరాతీపేట

శక్తియాప్ ఫోన్‌లో ఉంటే సురక్షితంగా ఉన్నట్టేనని శక్తియాప్ టీమ్ సభ్యులు తెలిపారు. గురువారం జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థులు, అదేవిధంగా ఆర్‌టిసి బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో మహిళ ప్రయాణికులకు ఎస్‌పి ఆదేశాల మేరకు శక్తియాప్ ప్రాధాన్యతపై అవగాహన కల్పిస్తున్నారు. వారి ఫోన్లలో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేయిస్తూ ఆత్మరక్షణపై నైపుణ్యం ఉన్న శిక్షకులతో సెల్ఫ్ డిఫెన్స్ తరగతులు డెమో ద్వారా ప్రదర్శించారు. విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్, మహిళ చట్టాలపై శక్తి టీమ్ పోలీసులు తెలియజేశారు.

ఆరుబయటే సైకిళ్లు

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సైకిళ్లు పెట్టుకునేందుకు రేకు షెడ్డు లేకపోవడంతో ఆరుబయట ఎండలోనే ఉంచుకోవాల్సి వస్తోంది. వేసవి ఎండ తీవ్రత ఎక్కువ వల్ల రోజూ టైర్లు ప్యాచీలై ఇబ్బందులకు గురవుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. శివరాంపురం, వేణుగోపాలపురం, నరేంద్రపురం, పెంటవూరు, స్వామిపేట, సుభద్రాపురం గ్రామాల నుంచి సుమారు 300 మంది విద్యార్థులు ఐదు కిలోమీటర్ల దూరం నుంచి సైకిళ్లు తొక్కుకొని వస్తూ.. వెళ్తూ ఉంటారు. ఈ సమయంలో సైకిళ్లు మరమ్మతులకు గురైతే విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం. నాయకులు స్పందించి సైకిళ్లు



ఆరుబయట ఉంచిన సైకిళ్లు

ఉంచుకునేందుకు షెడ్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.